సాక్షి తిరుపతి

బుధవారం । 2 । ఆగస్టు । 2023



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి అధికారులు స్వాగతం పలికారు. - 8లో



ఓపెన్ స్కూల్.. బంగారు భవిత

ఉద్యోగోన్నతుల, ఉన్నత విద్యావకాశాలు అవసరమైన వారికి ఓపెన్ స్కూల్ వరంగా మారింది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	27
చిత్తూరు	37	26
తిరుమల	32	21
గూడూరు	37	28
నగరి	38	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 68,601 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,396 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 5.21 కోట్ల ఆదాయ వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ఉన్నత విద్యాబోధనకు అనుభవజ్ఞులు



వీసీ భారతితో సీనియర్ అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఉన్నత విద్యాబోధన సక్రమంగా సాగాలంటే అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలు అవసరమని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి తెలిపారు. విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకుల రిటైర్‌మెంట్ వయసును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై సీనియర్ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఈ మేరకు వీసీ మాట్లాడుతూ విద్యార్థుల పరిశోధనలకు మరింత సహకారం అందించి యూనివర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేసేందుకు సీనియర్ అధ్యాపకులకు మరింత అవకాశముంటుందని వెల్లడించారు. అధ్యాపకుల సంఘం నేతలు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో నిరంతర బోధన, పరిశోధనలు చేస్తున్న సీనియర్ అధ్యాపకులకు ఇది తీపి కబురని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని, ఆచార్య కాత్యాయిని, ఆచార్య నాగరాజు, పీఆర్‌ఓ డాక్టర్ రజని పాల్గొన్నారు.

6 నుంచి పాళ్యెంకొండపై ఆడికృత్తిక ఉత్సవాలు



శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

పాకాల : మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ ఊట్లవారి పల్లె సమీపంలోని పాళ్యంకొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఆడి కృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజున మూషికవాహనంపై వినాయక స్వామి ఊరేగింపు జరిపించనున్నారు. 7న నందివాహనంపై ఆదిదంపతులు విహరించనున్నారు. 8న నెమలి వాహనంపై అధిష్టించి సుబ్రమణ్యస్వామి భక్తులను కటాక్షించనున్నారు. 9న స్వామివారికి పుష్పపల్లకీ సేవ నిర్వహించనున్నారు. 10వ తేదీన కంకణ విసర్జన, ధ్వజారోహణము, ఏకాంతసేవ జరిపించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా సకల వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచన మేరకు ఉత్సవాల సమయంలో భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేయనున్నట్లు వెల్లడించారు.

గజవాహనంపై సిరులతల్లి విహారం



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవారి దేవేరి


తిరుచానూరు(చంద్రగిరి) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు మంగళవారం సాయంత్రం గజవాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మనక్షత్రమై ఉత్తరాషాఢం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు సమర్పించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణలో అమ్మవారు గజవాహనంపై ఆశీనులై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, ఏఈఓ రమేష్, ఏవీఎస్ఓ శైలేంద్రబాబు, సూపరింటెండెంట్ మధుసూదన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, వీఐ రామ్మోహన్, జమేదారు ధనంజయుడు పాల్గొన్నారు.

నాడు ఆమోదం.. నేడు అభ్యంతరం!

అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట.. ఓటమిపాలైనప్పుడు మరోమాట.. ఎన్నికలు వస్తుంటే ఇంకోమాట.. అధికారం వెలగబెట్టినప్పుడేమో అభివృద్ధే మా అజెండా అంటారు. భూమి పూజలు.. శిలాఫలకాల ఆవిష్కరణల పేరిట అందరినీ మభ్యపెడతారు. పదవి కోల్పోయి ఇంటిదారి పట్టినప్పుడేమో ప్రజల ముఖం కూడా చూడకుండా తమ సొంత వ్యాపారవ్యవహారాలకే పరిమితమవుతుంటారు. ఎన్నికల తరుణం ఆసన్నమైతేనేమో జనహితమే లక్ష్యమంటూ నాటకాలు మొదలుపెడతారు. ఇదీ తిరుపతిలో టీడీపీ నాయకుల సంకుచిత చేష్టలు. వీరి రాజకీయ వికృత పోకడలను గమనిస్తున్న నగరవాసులు విస్తుబోతున్నారు. రహదారుల నిర్మాణం.. విస్తరణకు ప్రభుత్వం చేపట్టిన 'మాస్టర్ ప్లాన్'కు మోకాలడ్డుతున్న పచ్చనేతల తీరును చూసి మండిపడుతున్నారు. ప్రజావసరాలను పట్టించుకోకుండా అసత్య ప్రచారాలకు తెరతీయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఉనికి కోసం టీడీపీ నేతల దొంగాట
- మాస్టర్‌ప్లాన్ రహదారులపై విషప్రచారం
- అపోహలు సృష్టించడానికి రాద్ధాంతం
- పచ్చనేతల నాటకాలకు విస్తుబోతున్న ప్రజానీకం

టీడీపీ హయాంలో ఆమోదించిన మాస్టర్ ప్లాన్ మ్యాప్





తిరుపతి బాలాజీ కాలనీ శ్మశాన వాటికలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు

తిరుపతి తుడా / తిరుపతి సిటీ : గత టీడీపీ ప్రభుత్వంలో తిరుపతి నగర అభివృద్ధే ధ్యేయమంటూ బూటకపు మాటలు చెప్పారు. మరో 25 ఏళ్ల అవసరాలకు తగ్గట్టు రహదారులను తీర్చిదిద్దుతామంటూ బీరాలు పలికారు. 2016లో అప్పటి తుడా చైర్మన్ నరసింహయాదవ్ నేతృత్వంలో రోడ్ల నిర్మాణానికి మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి చెందిన ఓ బడా కన్సల్టెన్సీ కంపెనీకి మాస్టర్‌ప్లాన్ రూపొందించే బాధ్యతను అప్పగించారు. ఇందుకోసం ఏకంగా రూ.5కోట్ల ప్రజాధనాన్ని వినియోగించారు. తీరా ప్లాన్ పూర్తయిన తర్వాత పట్టించుకోవడం మానేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి మళ్లీ మాస్టర్‌ప్లాన్‌ను తెరమీదకు తీసుకువచ్చారు. ఆ ఏడాది మార్చి 8వ తేదీన తుడా మాస్టర్‌ప్లాన్‌ను ఆమోదిస్తూ జీఓ నంబర్ 112 జారీ చేసి చేతులు దులిపేసుకున్నారు.

ఆర్భాటంగా సమావేశాలు

టీడీపీ హయాంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌లో ఎస్వీయూనివర్సిటీ వద్ద రోడ్ల విస్తరణను ప్రతిపాదించారు. అప్పట్లో మాస్టర్‌ప్లాన్ ఆమోదానికి ముందు గ్రామసభలు, సమావేశాలు, మేధావుల సలహాల పేరిట భారీ హంగామా చేశారు. ప్లాన్ అమలుపై 2,740 అభ్యంతరాలు, 114 సలహాలు అందినట్లు ప్రకటించారు. అయితే ప్రస్తుతం టీడీపీ నేతలు రాద్ధాంతం చేస్తున్న ఎస్వీయూ రోడ్డు-జూపార్క్ రోడ్డు కలుపుతూ ప్రతిపాదించిన మూడు రహదారులపై అప్పట్లో ఒక్క ఫిర్యాదు కూడా అందకపోవడం గమనార్హం. ఈ విషయం తెలిసినా టీడీపీ నేతలు అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలు చోద్యం చూశారు. ఇప్పుడు మాత్రం పచ్చనేతలతో కలిసి నానా యాగీ చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే..

టీడీపీ హయాంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కార్యరూపంలోకి తీసుకువచ్చింది. ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత మెరుగైన వసతులను సమకూరుస్తోంది. ఇందుకోసం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అక్కడక్కడా తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించారు. నాణ్యతకు పెద్దపీట వేస్తూ, సువిశాలమైన రహదారుల నిర్మాణానికి నడుంబిగించారు. భవిష్యత్‌లో కూడా ట్రాఫిక్ కష్టాలు తలెత్తకుండా పకడ్బందీగా మాస్టర్‌ప్లాన్ అమలు చేయిస్తున్నారు. దీనిపై తిరుపతి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

చెర్లోపల్లె నుంచి తిరుపతికి వచ్చేందుకు ఎస్వీ యూనివర్సిటీ, బాలాజీ కాలనీ మీదుగా ఒక మార్గం, జూపార్క్ రోడ్డులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సుమారు 6 కిలోమీటర్ల మేర పొడవుతో ఉండే ఈ రహదారులను కలిపే లింక్ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కనెక్టివిటీ పెంచేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో ఆమోదించిన మేరకు ఎస్వీయూనివర్సిటీ, జూపార్కును కలుపుతూ లింక్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో గత వారం టీటీడీ, ఎస్వీ యూనివర్సిటీ అధికారులతో కలసి మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్విమ్స్, బర్డ్, రుయా, ప్రభుత్వ ప్రసూతి, మెడికల్ కళాశాలలు, పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి, ఆయుర్వేదిక్ ఆస్పత్రులకు ప్రజలు సులువుగా రాకపోకలు సాగించేందుకు ఎస్వీయూ మొదటి గేటు మాస్టర్ ప్లాన్ రోడ్డుతో సౌకర్యవంతంగా ఉంటుంది. అలాగే మూడో గేటు, ఇంజినీరింగ్ కళాశాల తూర్పువైపున ప్రస్తుతం ఉన్న రోడ్లను విస్తరించడంతో ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డుపై ఒత్తిడి తగ్గి ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చు. ఆయా మార్గాల్లో చెట్లు తొలగించకుండా, భవనాలకు ఎలాంటి నష్టం ఏర్పడకుండా పక్కా ప్రణాళికలతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఇవేమీ పట్టని ప్రతిపక్షపార్టీల నేతలు విమర్శలే అజెండాగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు.

చేసింది శూన్యం

చంద్రబాబు 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ప్రజలకు చేసింది శూన్యం. ఆయన హయాంలో తిరుపతి ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఎస్వీ యూనివర్సిటీ నుంచి జూపార్క్ రోడ్డును కలుపుతూ రహదారులు నిర్మిస్తే వేయడంతో తొలుత ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. అలాగే ఆస్పత్రులు, విద్యాలయాలకు రాకపోకలు సులభతరంగా మారుతుంది. ప్రజల్లో అపోహలు సృష్టించే పనులను టీడీపీ నేతలు మానుకోవాలి.

– కుమార్, ఎస్వీ నగర్, తిరుపతి

అనవసర రాద్ధాంతం

నగరంలో ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయి. ఆస్పత్రులకు వెళ్లాలంటే కూడా నానా అవస్థలు పడుతున్నాం. మాస్టర్ ప్లాన్ రోడ్లతో కనెక్టివిటీ పెరిగి ట్రాఫిక్ సమస్య పక్కాగా పరిష్కారమవుతుంది. టీడీపీ నేతలది అనవసర రాద్ధాంతం. వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఎన్నికల కోసమే ఈ నాటకాలు మొదలు పెట్టారు.

– చంద్రబాబు, పద్మావతీనగర్, తిరుపతి

నాలుగేళ్లుగా సువర్ణ పాలన



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పక్కన మేయర్ శిరీష తదితరులు

- పేదోళ్ల గుండెల్లో జగనన్న
- బాబు, పవన్ విమర్శలను ప్రజలు నమ్మరు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో నాలుగేళ్లుగా సువర్ణ పాలన సాగుతోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి 19వ డివిజన్ ఎమ్మార్‌పల్లె వైకుంఠపురంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అందుకే పేదల గుండెల్లో జగనన్న సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజలే కొండంత అండగా నిలుస్తున్నారన్నారు. పెత్తందార్లకు కొమ్ముకాస్తూ రూ.కోట్లు దండుకున్న చంద్రబాబుకు మళ్లీ తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఏనాడూ ప్రజలకు మేలు చేయలేదని, అబద్ధపు హామీలతో మోసం చేశారని ఆరోపించారు. బాబు, పవన్ కల్యాణ్ మాయమాటలతో జనం ముందుకు వస్తున్నారని, అయితే వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని వెల్లడించారు. తిరుపతి నగరంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటే అంతకేంటే ప్రజాద్రోహం ఉండదని మండిపడ్డారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు ఆరణి సంధ్య, రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, రేమాల బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్ రాయల్, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, తిమ్మారెడ్డి, పడమటి కుమార్, కిషోర్, సద్దాబాబు, కైలాస్, రవి, నారాయణ, ఉమాపతి, జయచంద్రారెడ్డి, నాగయ్య, ధనంజయ్య, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల ఖాతాల్లోకే 'అమ్మఒడి'



వివరాల నమోదును పరిశీలిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య

తిరుపతి అర్బన్ : ఇంటర్మీడియట్ చదువుతున్న ఎస్సీ విద్యార్థుల ఖాతాల్లో అమ్మఒడి నగదు జమ చేయనున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య వెల్లడించారు. మంగళవారం లక్ష్మీనగర్ కాలనీ, చైతన్యపురం, దామినీడు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు తమ బ్యాంక్ ఖాతాలను ఓపెన్ చేయాలని సూచించారు. ఎస్సీ, బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్లు జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. జాబితాలో ఎలాంటి తప్పులకు తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. సచివాలయ సిబ్బంది నమోదు చేస్తున్న వివరాల్లో చిన్నపాటి తప్పు దొర్లినా సంక్షేమ పథకాలు పొందేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ఆన్‌లైన్‌లో చేసే సమయంలో విద్యార్థుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని ఆయన సూచించారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మా-డి, కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. గేట్, జి పాట్ అర్హత మార్కులు కలిగిన అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోపు జనరల్ అభ్యర్థులు రూ. 600, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.300 రుసుముతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీలోపు నిర్దేశించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని కోరారు. 22వ తేదీ నుంచి గేట్, జి పాట్ అభ్యర్థులకు సీట్లు అలాట్ చేస్తామన్నారు. అలాగే పీజీఈసెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 26 నుంచి 31 తేదీలోపు నిర్దేశించిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వచ్చేనెల 8 నుంచి 11వ తేదీ వరకు వెబ్ ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని, అదే నెల 15వ తేదీ నుంచి సీట్లు అలాట్ చేస్తామన్నారు. అభ్యర్థులు https// cets. apsche .apgov.in వెబ్‌సైట్‌ను వీక్షించి అవసరమైన ధ్రువపత్రాలను, రుసుము చెల్లించి ప్రవేశం పొందాలని పేర్కొన్నారు.

'ఆల్తూరుపాడు'కు హైలెవల్ కమిటీ



వివరాలు సేకరిస్తున్న హైలెవల్ కమిటీ

దక్కిలి : మండలంలోని ఆల్లూరుపాడు రిజర్వాయర్‌ను హైలెవల్ కమిటీ మంగళవారం సందర్శించింది. ఇటీవల వెంకటగిరిలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆల్తూరుపాడు రిజర్వాయర్ పూర్తి చేసేందుకు రూ.530 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. ఈ క్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు అన్నిశాఖలతో కూడిన కమిటీ ప్రాజెక్టును పరిశీలించింది. రిజర్వాయర్ నిర్మాణంలో భూముల కోల్పోయే రైతుల వివరాలను సేకరించింది. అటవీశాఖ అనుమతులపై ఆరా తీసింది. ప్రాజెక్టు నిర్మాణానికి ఎక్కడ నుంచి మట్టి తరలించాలనే విషయంపై చర్చించింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ మాట్లాడుతూ త్వరలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు ప్రారంభించేందుకు స్థానిక సమస్యలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ మేరకు ప్రాజెక్టును సందర్శించామని, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపులపై రెవెన్యూ అధికారులతో కలిసి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి అసిఫా, ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఇరిగేషన్ ఈఈ రాధాకృష్ణమూర్తి, సబ్ డీఎఫ్ఓ జ్ఞాన ప్రకాష్, రేంజర్ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ రమేష్‌బాబు, సర్వేయర్ మునస్వామి, సౌత్ డీఆర్ఓ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్.. బంగారు భవిత

ఉద్యోగ అవకాశాలు, ఉద్యోగోన్నతులు, ఉన్నత చదువులు అవసరమైన వారికి ఏపీ ఓపెన్ స్కూల్ విద్య వరంలా మారింది. సార్వత్రిక విద్యా విధానంపై పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానంలో చదువుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ స్టడీ సెంటర్‌లను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023–24 విద్యాసంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ కోర్సుల అడ్మిషన్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 118 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఓపెన్ స్కూల్ కోర్సుల ఉపయోగంపై ప్రత్యేక కథనం..

- రెగ్యులర్ కోర్సులతో సమానంగా గుర్తింపు
- ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియట్ కోర్సులు
- అడ్మిషన్‌లకు నోటిఫికేషన్ విడుదల
- ఉమ్మడి జిల్లాలో 118 స్టడీ సెంటర్లు



దీఈఓ కార్యాలయంలోని ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్

చిత్తూరు కలెక్టరేట్ : పాఠశాలలో చదువుకునే అవకాశం లేని వారికి, వయోజనులకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) బంగారు భవిత కల్పిస్తోంది. దూర విద్యావిధానంలో పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 118 ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో స్టడీ సెంటర్లలో కోర్సులను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఓపెన్ స్కూల్ ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. పది పరీక్షలకు హాజరు కావాలంటే నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు టెన్త్ పాసై రెండేళ్లు వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులూ ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక్క సబ్జెక్టూ రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిదిసార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందలేకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్‌కు టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు కుల ధ్రువీకరణతో పాటు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలి.

సబ్జెక్టులు ఇలా ..

పదో తరగతికి గ్రూపు–ఏలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బీలో గణితం, సైన్స్ సోషల్ తీసుకోవాలి. ఇంటర్‌కు గ్రూపు–ఏలో ఇంగ్లిషుతో పాటు తెలుగు/హిందీ/తమిళం/ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు–బీలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు. ఐదేళ్లలో పూర్తి చేయాలి. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, ప్రతి నెలా రెండో శనివారం ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 20 కాంటాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

గత ఐదేళ్ల అడ్మిషన్ల వివరాలు		
సంవత్సరం	టెన్త్	ఇంటర్
2018–19	4,675	4,233
2019–20	4,572	4,610
2020–21	4,739	6,215
2021–22	3,614	3,928
2022–23	3,095	3,996

రెగ్యులర్ విద్యార్థులకూ సదావకాశం

రెగ్యులర్ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలలో చేరి, సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకుని పాసయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ పదో తరగతి, ఇంటర్ ఫెయిలైనప్పటి నుంచి ఐదేళ్ల లోపు సార్వత్రిక పాఠశాలలో చేరితే.. రెగ్యులర్‌గా పాసైన సబ్జెక్టుల నుంచి ఏవైనా రెండు సబ్జెక్టుల మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. పదిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది.

దరఖాస్తు ఇలా

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 118 అక్రిడిడేటెడ్ ఇన్‌స్టిట్యూషన్లు (ఏఐ) ఉన్నాయి. ప్రవేశాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేంద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఫీజు చెల్లించాలి.
- ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు.
- పదో తరగతిలో జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,400, అన్ని వర్గాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ.1,000 చెల్లించాలి.
- ఇంటర్‌లో జనరల్ పురుషులకు రూ.1,600, అన్ని వర్గాల మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనారిటీ వారికి రూ.1,300 చొప్పున ఫీజు చెల్లించాలి. ఈ ఫీజులకు అదనంగా మీసేవ చార్జీలు రూ.36 చెల్లించాల్సి ఉంటుంది.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు గుర్తింపు



ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా చదువుకునే వారికి రెగ్యులర్ టెన్త్, ఇంటర్ మాదిరిగానే అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలకూ గుర్తింపు ఉంటుంది. ఉపాధి, ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అడ్మిషన్‌లు చేయించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కాకుండా ఎక్కువగా వసూలు చేస్తే కఠిన చర్యలుంటాయ్.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు చర్యలు



ఈ విద్యాసంవత్సరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రణాళిక ప్రకారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. అన్ని శాఖల సమన్వయంతో ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్ల పెంపునకు కసరత్తు చేస్తున్నాం. మధ్యలో చదువు ఆపేసిన వారు సద్వినియోగం చేసుకోవాలి.

– గురుస్వామిరెడ్డి, జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు



తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఓజిలి: మండలంలోని రాజుపాళెం గ్రామంలో కృష్ణయ్య అనే వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. నాయుడుపేట రూరల్ సీఐ సోమయ్య, ఎస్‌ఐ ఆదిలక్ష్మి ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కృష్ణయ్య కుమార్తెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రిమాండ్ ఖైదీ మృతి

తిరుపతి క్రైమ్: హత్యకేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. రామకుప్పం గ్రామానికి చెందిన ప్రమీల(47) కొంతకాలంగా బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఓ హత్య కేసులో ఈమె మదనపల్లె జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంది. ఇదే క్రమంలో ఆమెకు గత నెలలో గుండెపోటు రావడంతో మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. అయితే మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి గత నెల 26వ తేదీన తరలించారు. ఆమె ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,380
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,512
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.76,700
రిటైల్ వెండి గ్రాము రూ.78.70

పరీక్షలకు పటిష్ట చర్యలు

- నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు
- 2నుంచి 7వ తేదీ వరకు పరీక్షలు
- పరీక్షలపై అధికారులతో డీఆర్వో సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి

తిరుపతి అర్బన్: ఏపీ పీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీఆర్వో కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 7వ తేదీ వరకు పుత్తూరులోని శ్రీవెంకటేశ్వర పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు ఉంటాయని చెప్పారు. అంతేకాకుండా ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు తిరుపతి కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, రామిరెడ్డిపల్లి ఐయాన్ డిజిటల్ కళాశాలలోను పరీక్షలు ఉంటాయని చెప్పారు. మరోవైపు ఈనెల 3వ తేదీన పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, గూడూరు ఆదిశంకరా ఇంజినీరింగ్ కళాశాలలోను పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఆబ్జెక్టివ్ పరీక్షలు రెండు సెషన్స్‌లో ఉంటాయని తెలిపారు. ఉదయం 10–12 గంటల వరకు, మధ్యాహ్నం 3–5 గంటల వరకు ఉంటాయన్నారు. మరోవైపు కన్వెన్షనల్ టైప్ పరీక్షలు ఉదయం 10– ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షల సమయంలో అవసరం అయిన మేరకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీటి వసతి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు, బస్సు సౌకర్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. చిన్నపాటి పొరపాట్లు చేసినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఏటీఎం రామచంద్రనాయుడు, ట్రాన్స్‌కో ఏఈ గణపతి, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ చంద్రశేఖర్, డాక్టర్ ఉదయశ్రీ, డీటీ చెంచయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం

- మరో ఉపాధ్యాయుడికి తీవ్ర గాయాలు
- మృతుడిది శ్రీకాళహస్తి మండలం పెద్దకన్నలి

కుప్పంరూరల్ : మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.అగ్రహారం ఉపాధ్యాయుడు వేణుగోపాలాచారి (51) దుర్మరణం చెందగా, మరో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం మండలం డి.అగ్రహారం ఉపాధ్యాయుడు వేణుగోపాలాచారి (51) డిప్యూటేషన్‌పై జంపనూరు పాఠశాలలో పని చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ముగించుకుని, స్నేహితుడు, కనుమపచ్చార్లపల్లె ఉపాధ్యాయుడు గోవిందస్వామితో కలిసి తమిళనాడు రాష్ట్రం పచ్చూరికి సొంత పనుల నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. మల్లానూరు పంచాయతీ కృష్ణాపురం సమీపానికి రాగానే ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో వేణుగోపాలాచారి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. గోవిందస్వామి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గమనించి గోవిందస్వామిని ఆస్పత్రికి తరలించారు. వేణుగోపాలాచారి శ్రీకాళహస్తి మండలం, పెద్దకన్నలి గ్రామానికి చెందిన వారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వేణుగోపాలాచారి (ఫైల్)

7లోపు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : 'ఆడుదాం ఆంధ్ర' పోటీల నిర్వహణ లోగో, మస్కట్ ఎంపిక పోటీలకు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు అక్టోబర్ 2వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పోటీల నిర్వహణలో లోగో, మస్కట్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు www.sports.ap. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన్న తర్వాత లోగో, మస్కట్‌లు ఎంపికైతే సంబంధిత విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు అందజేస్తారని చెప్పారు.

గందరగోళంగా 'నారాయణ' నిర్వహణ

వి.కోట: పేరుకు నారాయణ పాఠశాల. విద్యార్థులకు మంజూరు చేసే టీసీలు మాత్రం శ్రీసత్యసాయి పాఠశాల అంటూ తల్లిదండ్రులు యాజమాన్యంపై విరుచుకుపడుతున్నారు. మండలంలోని ఎర్రపల్లెకు చెందిన ఓ విద్యార్థి వి.కోటలోని నారాయణ విద్యా సంస్థల పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ టీసీ కావాలని ప్రిన్సిపాల్‌ను అడిగారు. ఆమె సత్యసాయి పాఠశాలలో విద్య అభ్యసించినట్లు టీసీ ఇచ్చారు. నారాయణ పాఠశాల పేరిట అధిక ఫీజు వసూలు చేసి టీసీ సత్యసాయి అని ఇవ్వడమేంటని బాధితుడు ప్రశ్నించారు. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ వివరణ కోరగా 2022 మే నెలలో నారాయణ విద్యా సంస్థల వారు గతంలో సత్యసాయి పాఠశాలను టేకోవర్ చేసుకున్నారని, అడ్మిషన్ల సమయంలో రాష్ట్రంలో నారాయణ విద్యా సంస్థల ప్రారంభానికి అనుమతులు లేకపోవడంతో తరగతులు మాత్రం నిర్వహిస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలకు అనుమతులు మంజూరయ్యాయని, గతంలో అడ్మిషన్ అయిన వారికి సత్యసాయి పాఠశాలగానే టీసీలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ అధిక ఫీజులపై మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థల ప్రకారమే బోధన కొనసాగించామని, అనుమతులు రాక ముందు అడ్మిషన్ అయిన పిల్లలను సత్యసాయి పాఠశాలలో కొనసాగించామని తెలిపారు.

గడప గడపలో ఆప్యాయత



చెవిరెడ్డి లక్ష్మి, మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

తిరుపతి మంగళం : సప్తగిరినగర్ పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. యోగక్షేమాలను విచారించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. రాబోయే ఎన్నికల్లో తమ బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి సైతం ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీగా తాను చేసిన అభివృద్ధి పనులను చూసి ఆదరించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. గత 30 ఏళ్లలో ఏనాడూ జరగనంత అభివృద్ధిని నాలుగేళ్లలోనే చేసి చూపించామని వెల్లడించారు. ఒక్కో పంచాయతీకి రూ.10కోట్ల నుంచి రూ.12కోట్ల వరకు అభివృద్ధి పనులకు వెచ్చించామని వివరించారు. వైఎస్సార్ సీపీ పంచాయతీల అధ్యక్షులు అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మహ్మద్‌ఖాసీం, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, వార్డు సభ్యులు దీపశ్రీ, మంజుల, కవిత, వెంకటసుబ్బమ్మ, శాంత, మురుగేష్, మహేశ్వర రెడ్డి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి కల్చరల్: స్విమ్స్ యూనివర్సిటీ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సుల్లో 2023–24 ఏడాదికి అడ్మిషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. నీట్ ప్రవేశపరీక్ష ద్వారా ఆల్ ఇండియా కోటాలో ర్యాంకులను సాధించిన విద్యార్థులు స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందారు. తిరుపతికి చెందిన విద్యార్థిని కమటం లీనాసాయి జాతీయ స్థాయిలో 15,063 ర్యాంకు సాధించి మొదటి అడ్మిషన్ పొందారు. అలాగే మహారాష్ట్రకు చెందిన విద్యార్థిని లంకల్వాడే కేటకి కైలాస్ 1,02,639 ర్యాంక్ సాధించి రెండో అడ్మిషన్ పొందారు. టీటీడీ జేఈఓ, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి సదా భార్గవి మొదటి, రెండు అడ్మిషన్ల ఆర్డర్ పత్రాలను విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా సదా భార్గవి మాట్లాడుతూ ఆలిండియా కోటా ద్వారా శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలకు కేటాయించిన 26 సీట్లలో ఈ రోజు ఇద్దరు విద్యార్థినులు స్విమ్స్ ఎంబీబీఎస్ అడ్మిషన్లు పొందారని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు ఈ సందర్భంగా ఆమె అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరణ్ బి.సింగ్, డెప్యూటీ డైరెక్టర్ డీవీ.దిలీప్‌కుమార్, కొబాకు భూపాల్ పాల్గొన్నారు.



విద్యార్థినికి అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న స్విమ్స్ సంచాలకులు సదా భార్గవి

గొల్లపల్లెమ్మ ఆలయంలో చోరీ

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో వెలసి ఉన్న గొల్లపల్లెమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం ఉదయం ఆలయ ధర్మకర్త రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎస్‌ఐ కృష్ణయ్య కథనం మేరకు.. దుండగులు ఆలయం ప్రవేశించి అమ్మవారి తాళిబొట్టు, మెమరీ కార్డులను చోరీ చేశారని తెలిపారు. సీసీ కెమెరాల్లో నిందితులు చోరీ చేస్తున్న దృశ్యాలు నమోదయ్యాయని, త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు. కొద్ది రోజుల కిందట మద్దిపట్లవారిపల్లె శ్రీ విరూపాక్షి అమ్మవారి ఆలయంలో కూడా చోరీ జరిగిందన్నారు. కొందరు యువకులు గ్రామాల్లో చెత్త, ప్లాస్టిక్, బాటిళ్లను ఏరుకుంటున్నట్లు నటిస్తూ చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

6 నుంచి ఉమ్మడి జిల్లాల చెస్ పోటీలు

నగరి : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి ఉమ్మడి జిల్లాల చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కేవీకే ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 16 ఏళ్లకు పైబడివారికి ఓపెన్ కేటగిరీలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. రెండు కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు కప్‌లు అందిస్తామన్నారు. జూనియర్స్‌లో 20 మందికి, సీనియర్స్‌లో 10 మందికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు గల బాల, బాలికలు, దివ్యాంగులకు, మహిళలకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 94402 13131, 89772 99886 నంబరలో సంప్రదించాలని తెలిపారు.

అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల నుంచి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్–2024కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో విజయేంద్రరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో అందజేసే అవార్డులకు ఈనెల 31 లోపు www.award.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డీవైఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని డీఈవో ఆ ప్రకటనలో సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో వడమాలపేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

పుత్తూరు రూరల్: అనకాపల్లి రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో గత నెల 29 నుంచి రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పట్టు) పోటీల్లో వడమాలపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఆరో తరగతి విద్యార్థి తనుష్ 24 కేజీల విభాగంలో, తొమ్మిదో తరగతి చదువుతున్న అంజలి 34 కేజీల విభాగంలో, ఉదయ్ కుమార్ 66 కేజీల విభాగంలో, శ్రావణ్‌కుమార్ 84 కేజీల విభాగంలో బంగారు పతకాలను సాధించారు. అలాగే వివిధ కేటగిరీల్లో దేవహర్ష, మోహిత్, కిషోర్, యూనస్, లతాశ్రీ వెండి పతకాలతో మెరిశారు. జైసూర్య, రేవంత్‌కుమార్, భానుప్రకాష్, జగదీష్, ప్రియదర్శిని కాంస్య పతకాలను సాధించి సత్తా చాటారు. బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు.